# జబ్బు

'సత్య నారాయణకు జబ్బు చేసింది. నోరు లేదు. మాటపడిపోయింది. గుటక దిగటం లేదు. మెతుకు లోనికి పోదు. నీళ్ళూ తాగలేదు. అంతా ఎక్కించటమే. నెలయింది. మనిషి చిక్కిపోయాడు. ఎముకలగూడు. వంటో నీరంతా కన్నీరే! ఇవాళో రేపో చెప్పలేం. అంతా బెడ్‌లోనే. డాక్టర్లది ఒకేమాట. ఏ జబ్బూలేదు. మనేది అంటుంది భార్య తులసమ్మ. ఏం మనేదో ఏమో, నువ్వొకసారి రా! చూసిపో! ఆఖరి చూపులు కావచ్చు'. రామశేషయ్య ఉత్తరం.సత్యనారాయణకూడా సంతకం– గిలికినట్లు – చేశాడు.

కోటిలింగం ఏడుస్తున్నాడు. ఉత్తరం చదువుతున్నంత సేపూ ఏడ్చాడు. మళ్ళీ చదివి, మళ్ళీ ఏడ్చాడు. చదువుతూ ఏడవటం, ఏడవటానికి చదవటం. అతడికి కాళ్ళూ చేతులు ఆడటంలేదు.

తులసమ్మ మంచి ఇల్లాలు. అణిగిమణిగి ఒదిగి ఒదిగి ఉంటుంది. చెప్పినమాట వింటుంది. చేయమన్నది చేస్తుంది, ఎదురాడదు. పొదుపరి. భర్త మనసెరిగిన నేర్పరి. కలతల్లేని సంసారం. అతడికి ఈ కష్టం ఎందుక్కలిగింది? ఎంత ఆలోచించినా కోటిలింగానికి అంతుపట్టలేదు.

పిల్లలు, చదువులు, పెళ్ళిళ్ళు ఈ జంజుకానా లేదు. ఏ తొందరాలేదు. పిల్లల్లేరన్నది దిగులు. పదేళ్ళనాడే కాశీలో వదిలేశాడు.

లెక్చరరు. నెలజీతం ఠంచనుగా ముడుతుంది. ఇద్దరు. ఎంతకావాలి. జీతమంతా మిగిలిపోతుంది. పైగా కట్టుకుపోగలిగినంత ఆస్తి. ఏంచేసుకొంటాడు? డబ్బు ఇబ్బందులు లేవు. తాను ఒక్కడే కొడుకు. అంతా తనకే!

కలుపుగోలు మనిషి. మంచి మిత్రుడు. ఎవరితోను తగాదా పడడు. గొడవల్లో తల దూర్చడు. మిత్రులు కబుర్లు కాఫీలు సరదాలు తప్ప ఏ పేచీలు ఉండవు.

విద్యార్థులు ఆరాధిస్తారు. కాలేజీ మేనేజిమెంటు గౌరవిస్తుంది. శాఖలో లెక్చరర్లు చెప్పినట్లు వింటారు. మాటమన్నిస్తారు. మౌనంగా ఉంటారు.

సత్యనారాయణ మాటకారి అని, మర్యాదస్థుడని అటెండరు కాణ్ణుంచి ప్రిన్సిపాల్ దాకా అందరికీ ఇష్టం. అతడికి ఏ సమస్యా లేదు. మనేదకి ఏంకారణం ఉంటుంది?

పాతికేళ్ళ క్రితం పెళ్ళయింది. పెళ్ళికి ముందు గురుడు ప్రేమించకపోలేదు. ప్రేమించాడు. కాని తెలపలేదు. ఆమె పెళ్లిచేసుకొని వెళ్ళిపోయింది. కనపడ్డప్పుడు

'ఏం సత్యం బాగున్నావా?' అంటుంది. భర్తను పరిచయం చేసింది. పిల్లల్ని చూపించింది. ఎప్పుడయినా ఉత్తరాలు రాస్తుంది. ఆమె ప్రేమను పట్టుకొని అతనేమీ వేలబడటం లేదు. ఎప్పుడో మర్చిపోయాడు. ఇప్పుడు గుర్తుకూడా లేదు.

నియమనిష్ఠలెక్కువ. దైవభక్తి జాస్తి. సెలవుల్లో గుళ్ళూ గోపురాలు తీర్థాలు, క్షేత్రాలు భార్యతో తిరిగి సంతృప్తిగా ఇల్లు చేరతాడు. అమ్మానాన్నా బాగున్నారు. ఆస్తిపాస్తులు వాళ్ళే చూసుకొంటారు.

కులం, గోత్రం, మతం, మంచి, మర్యాద, ఆచార వ్యవహారాలు, ఆహార విహారాలు ఎన్ని ఉన్నా, అందరితో కలిసి మెలిసి ఉండే మనిషి. ఏ గొడవలూ ఉండవు. పేచీలూ రావు. ఎందుకీ మనేద?

తనకు ఇష్టమైతే ఏద్దైనా చేస్తాడు. కష్టమైతే మానేస్తాడు. సంఘ జీవితంలో అందరితో కలిసి ఉండక తప్పదు కదా! తన ఇష్టం ఇంకొకరికి అననిష్టం కావచ్చు. తన అనిష్టం మరొకరికి ఇష్టం కావచ్చు. ఇష్టం-అనిష్టం కష్టం కలిగించినందువల్ల మనేద వస్తుందా? రాకపోవచ్చు. బంధువులు, ఆత్మీయులు మిత్రుల మధ్య ఈ కష్టం అనర్థంగా మారి ఉండవచ్చు. అది మనేదగా తిరగబడి ఉండవచ్చు.

కోటిలింగం సత్యనారాయణ బంధువులు కారు. ఒక్క చోట ఉద్యోగం కాదు. ఒక్క ఊరిలో నివాసం కాదు. ఒక్క కులం, ఒక్కమతం కాదు. కాని మంచి మిత్రులు. కొందరు వీళ్ళను లటుకు చిటుకు అనీ, జంటకవులనీ అనుకొనేవాళ్ళు.

వీళ్ళు సంవత్సరంలో రెండుసార్లే కలుస్తారు. ఏప్రెల్లో కలిసినప్పుడు నెల, అక్టోబరులో కలిసినప్పుడు పదిరోజులు వీళ్ళిద్దరూ బంకవేసి అతికించినట్లుండేవాళ్ళు. కోటిలింగంది అనంతపురం. సత్యనారాయణది ఆదోని. కలిసేది తిరుపతిలో, యూనివర్శిటీలో, పేపరు వాల్యూయేషన్ స్పాట్లో. ఎక్కువ మార్కులు వేస్తున్నారని ఇద్దరికీ చీఫ్‌తో చివాట్లు, మందలింపులు మామూలే.

దేవస్థానం సత్రంలో, మూడు రోజులకొకరి పేరుమీద వాళ్ళిద్దరూ మార్చి మార్చి ఆ రూంలోనే నెలరోజులు కూడా ఉండేవాళ్ళు. సత్యనారాయణ గది శుభ్రంగా ఊడ్చి, స్నానం చేసి, పూజచేసి, కోటి లింగాన్ని లేపేవాడు. ఇద్దరూ కలిసి భీమాలో టిఫిన్ చేసి ఒకే రిక్షాలో అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగుకు చేరేవాళ్ళు. కలసి తిండి, తీర్థం, పడక, నడక, రిక్షా, బలాదూరు బజారు తిరుగుళ్ళు.

కోటి సిగరెట్లు దంచి కాలుస్తాడు. సత్యం కాల్చాడు. అతను మాంసాహారం. ఇతను శాకాహారం. అతను నిద్ర. ఇతను పూజ. అతను జల్సారాయుడు. ఇతను నైష్ఠికుడు. ఇద్దరికీ ఏమి లంకె? అందరికీ గుంటాజనే! ఒకర్ని విడిచి ఒకరు ఉండే వారు కారు.

నువ్వెట్లా ప్రేమించావ్? ఏమేం చేశావ్? ఎట్లా వెంటపడ్డావ్? ఎట్లా ఒప్పించావ్? వంటి ప్రశ్నలు అడిగిందాన్ని మళ్ళీ మళ్ళీ అడిగేవాడు సత్యనారాయణ. ఒకే ప్రశ్న ఎన్నిసార్లు అడిగినా, చెప్పిన జవాబే మళ్ళీ చెప్పకుండా కొత్త జవాబులు కోటి చాలా చెప్పాడు. అన్ని సమాధానాలూ కరెక్టే అయినట్లు అన్నింటికి నూటికి నూరు మార్కులు వేస్తూ పోయేవాడు సత్యం.

సత్యానికి మరో ఇష్టమైన ప్రశ్న ఉంది. వందసార్లో, వేయిసార్లో అడిగి ఉంటాడా ప్రశ్నని. ఎన్నిసార్లు అడిగాడో, అన్ని వేరు వేరు జవాబులు చెప్పలేదు కోటి. ఒకటే అన్నరు 'తెలియదు'. కొన్నివందలసార్లు 'తెలియదు' వినేవాడు. అయినా అడిగే వాడు. 'సింగిలా? డబలా?' అని ఎదురుగా ఎవరైనా యువతో, స్త్రీనో వస్తే అలా అడిగేవాడు. 'ఆమె ఒంటరా? జంటగా ఉందా? జంటగా ఉంటే బాడీ గార్డా? భర్తా?' అని అతడి ఆరా! 'తెలియదం'టే 'తెలుసుకో' మనేవాడు. 'ఒంటరైతే ఏం చేస్తావ్? జంట అయితే ఏం చేస్తావ్?' అంటే 'జంటయితే చూణ్ణు, ఒంటరి అయితే చూస్తాను'. అనేవాడు. 'చూసి ఏం చేస్తా'వంటే, 'నలభై ఏళ్ళు దాటాయి. ఇంకేం చేస్తాను' అనేవాడు 'దాటకపోతే' అంటే 'ప్రేమిస్తాను' అనేవాడు. 'ప్రేమించి ఏం చేస్తావం'టే 'పెళ్ళి చేసుకొన్నాను కదా తులసమ్మను, ఏమీ చేయను' అనేవాడు. 'ఏమీ చేయని కాడికి ఎందుకీ ఆరా? నోరు మూసుకొని పద' అంటే మాట్లాడకుండా వచ్చేసేవాడు.

లేడీ కో ఎగ్జామినర్‌ని చూపించి 'సింగిలా? డబలా?' అన్నాడు ఒక రోజు. 'డబల్' అన్నాను. 'నీకెలా తెలుసు' అన్నాడు. 'చెప్పింద'ంటే 'నీకే ఎందుకు చెప్పింద? అన్నాడు. 'వెంటబడతావని భయపడిందా?' అన్నాడు. 'ఇద్దరు పిల్లల తల్లి' అంటే 'అది గూడానా? పెళ్ళికాని యువతిలాగా ఉంది' అన్నాడు 'ఆరోగ్యవంతురాల'ంటే అదిమి పట్టుకోలేని ఆనందంతో పగలబడి నవ్వాడు. ఎంత నవ్వాడంటే ఛీఫ్ 'సైలెన్స్' అన్నాడు.

అంతబాగా నవ్వే సత్యనారాయణ నోటివెంట నవ్వుకాదు. మాటకూడా లేదు. ఏడుస్తూనే ఆదోని చేరిన కోటిలింగం, హాస్పటల్ బెడ్ దగ్గరకు వచ్చి మిత్రుణ్ణి చూసి కళ్ళు తుడుచుకొన్నాడు.

కోటిని చూడగానే సత్యం కళ్ళు మెరిశాయి. కూర్చోమని చెప్పటానికి నోరు రాక చేయి లేపబోయాడు. బలహీనంగా పడిపోయింది.

ప్రక్కనే బెడ్‌మీద కూర్చున్న కోటి, అతడి శరీరం అంతా తడిమి చూశాడు. చర్మం, ఎముకలు తప్ప కండ తగల్లేదు. ఎంత ఆపుకొందామన్నా నీరు లోపల ఆగకుండా కళ్ళలోకి వస్తూ ఉంది.

మెరుపులైన సత్యం కళ్ళు మబ్బులు కమ్మి చెమ్మగిల్లాయి. కళ్ళు కనబడకుండా రెప్పలు మూతపెట్టాడు. కంటికి నీరడ్డం పడి మసకబారిన మనిషిని మూసుకొన్న బాగా చూడగలిగాడు.

కోటి ఆపుకొంటున్న ఏడుపును ఎక్కిళ్ళు చేసుకొన్నాడు. నీరు ధారగా కారుతున్న కళ్ళను తుడుచుకోవటం మానేశాడు.

సత్యం ఏమీ చెప్పటానికో నోరు తెరుస్తున్నా, మాట పెగిలి బైటికి రావటంలేదు. కావలసింది చెప్పలేకపోతున్నప్పుడు రాయటానికి పెట్టిన నోటు బుక్కునిండా, కోటి పేరు రాంకోటిలాగా రాశాడు సత్యం. కోటిని పిలిపించండని ఎన్నిసార్లో రాశాడు. 'వాడురాడా?' అనీ 'వాడు రాడు' అనీ, 'పాడె మోయటానికైనా రమ్మనండి' అనీ రాశాడు. కోటికి ఏడుపు ఆగటం లేదు.

కోటి కుడిచేతిని తన రెండు చేతులతో పట్టుకొని గుండెలమీద పెట్టుకొని, కళ్ళు మూసుకొని నిద్రలోకి సత్యం జారుతుంటే, నెమ్మదిగా బరువని గుండెలమీంచి చేతులు తీయసాగాడు కోటి. ఉలిక్కి పడి మేల్కొని , చేయి మళ్ళీ గట్టిగా పట్టుకొని ముఖంలోకి దీనంగా చూశాడు సత్యం.

'లేదు, పోవటంలేదు. ఇక్కడే ఉంటాను' అని కోటి హామీ ఇస్తే, మళ్ళీ సత్యం కళ్ళు మూసుకొని నిద్రలోకి వెళిపోయాడు.

'ఇన్నాళ్ళూ కంటిమీద కునుకులేదు. ఇవాళ సుదినం. మీ రాక మాభాగ్యం' అంటూ ఆవురుమన్న తులసమ్మ గొంతు నొక్కుకొని ఏడుపు దిగమింగి, నిశ్శబ్దంగా రోదిస్తూ ఉంది.

సత్యం నిద్రపోతున్నాడు. గుండె బరువున్నా బంగారంగా కొట్టుకొంటూ ఉంది.

పోయి నేడు స్పాట్ అయిపోయి, రూంఖాళీ చేసి, బయలు దేరబోతున్నప్పుడు 'నేనూ అనంతపురం వస్తున్నా' నన్నాడు సత్యం. బయలుదేరాక 'నీ ప్రేయసిని చూడాలి' అన్నాడు . 'ఇప్పుడు ప్రేయసి కాదు' అంటే 'నీ భార్యని' అన్నాడు. 'భార్య కూడా కాద'ంటే 'నీ తల్లినీ, నీ పిల్లల తల్లినీ' అన్నాడు.

కోటి ఇంట్లో ట్రంకుపెట్టి అతడి భార్యను పలకరించకుండా, పిల్లల్ని చూడకుండా, బంధుమిత్రుల్ని కలిసి వద్దాం రమ్మని తీసుకుపోయి ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా ఊరంతా బలాదూరుగా కోటిని తిప్పాడు సత్యం.

'నీకు ఇవాళ మాంసం వండుతుందా?' అంటే 'నేనింట్లో మాంసం తిన్ను. పెట్టదు. హోటళ్ళే' అన్నాడు కోటి.

'మనం సినిమా చూద్దామా?' అంటే 'రాత్రికి' అనుకొన్నారు.

బంధుమిత్రుల ఇళ్ళలో 'ఆకలి పొద్దు, అన్నంతినండి' అంటే 'కోటి కూటి ఋణం' అన్నాడు సత్యం.

ఆరోజు రాత్రిదాకా ఉండకుండా, మధ్యాహ్నమే అకస్మాత్తుగా అన్నం తినకుండా బస్సెక్కి ఆదోని వెళిపోయాడు సత్యనారాయణ.

హాస్పటల్ బెడ్ మీద సత్యం అటూ ఇటూ నీరసంగా కదిలితే కోటి చిచ్చు కొట్టాడు. అయినా నిద్రపోకుండా కళ్ళు తెరిచి తేటగా చూశాడు సత్యం.

కోటి అతడి ముఖం తుడిచి, కళ్ళు తుడిచి, తల సవరించి, చెంపలు నిమురుతుంటే బలహీనంగా నవ్వాడు సత్యం. ఎక్కిళ్ళు వస్తే ఏదో అనబోయి, నీళ్ళు అని రాశాడు. తులసమ్మ నీళ్ళ గ్లాసు అందించింది. నాలుగు రోజులుగా నీళ్ళు తాగలేదు. అడగలేదు సత్యం. ఆమెకు చాలా ఆనందం.

కోటి నీళ్ళు పట్టిస్తున్నాడు. సత్యం తాగటానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. మింగటానికి గొంతు కదుపుతున్నాడు. పడుకొన్న సత్యం గొంతులో నీళ్ళు జారి పక్కకు కారిపోతున్నాయి. సత్యం ఉగ్గుగిన్నెడు నీళ్ళు తాగి ఉండవచ్చు.

డాక్టరుకు, తులసమ్మకు నర్సుకు సత్యం ఏదైనా తాగాలని ప్రయత్నించటమే ఆనందంగా ఉంది.

పది నిమిషాల్లో మళ్ళీ 'పాలు' అని రాశాడు సత్యం. తులసమ్మ పట్టరాని ఆనందంతో గబగబా పాలు కలిపింది.

అతడి ఖాళీ కడుపు కదులుతూ ఉంది. ఏమీ లేని గొంతు గుటక పడుతూ ఉంది. శూన్యం మింగుతున్నాడు.

కోటి పాలు పట్టిస్తుంటే పక్కలకు కారిపోతున్నాయి. కానీ ఏమాత్రమో గొంతు దిగుతున్నట్లుంది. గుటక పడుతూ ఉంది. ఉగ్గిన్నె పాలు తాగి ఉంటే గగనమే. ఒక్క చుక్క గొంతు దిగినా అదృష్టమే!

'బ్రెడ్డు–పాలు' అని రాశాడు సత్యం. పాలలో బ్రెడ్డు ముక్కలు వేసి గుజ్జుగా కలుపుతూ ఉంది తులసమ్మ.

ఏడాది క్రితం కోటి ఇంట్లో, అసలు అనంతపురంలోనే అన్నం తినకుండా సత్యం ఆదోని వెళ్ళిపోయినప్పటి నుంచి కోటి అంతా పోగొట్టుకొన్నవాడిలాగా ఏడుపు బిగబట్టుకొని ఉన్నాడు.

సత్యం ఈ ఏడాది కాలంలో పది ఉత్తరాలు అయినా రాసి ఉంటాడు. కోటి వాటిని అందుకొన్నాడు. దేన్నీ చించలేదు. చదవలేదు. చదివితే దుఃఖం ఆపుకోలేక ఏడ్చి స్వాధీనం తప్పిపోతానని అతడి భయం.

ఇద్దరికీ మిత్రుడైన రామశేషయ్య ఉత్తరం కాకపోతే దాన్నీ చించి చదివేవాడుకాదు కోటి.

ఆరోజు అనంతపురం బస్సు స్టేండులో ట్రంకు తీసుకొని బస్సు ఎక్కబోయే ముందు. 'నేను భోజనం చేయను. నీ ఇంట్లో భోంచేస్తే నా బంధువులు నన్ను ఏమని ....' వాక్యం పూర్తిచేయలేకపోయాడు సత్యం. కోటికి అర్థమయింది.

'వండి, వార్చి, వడ్డించే ఆమె...'కోటి ఆపైన చెప్పలేకపోయాడు.

'ఆమె వండి వడ్డిస్తే తినవచ్చు. కాదన్ను. కానీ ఇది నీ ఇల్లు. నీ ఇంట్లో నేను...మా బంధువులు...' సత్యం నీళ్ళు నమిలాడు.

'నేనింకా నీకు – ఇంతకాలానికి–ఇప్పటికి కూడా నేన్నీకు....' ఏడుపువల్ల మాట పూడుకుపోయింది. నాటి నుంచి కోటిగుండె రాయి అయ్యింది.

ఈ పరిస్థితుల్లో సత్యాన్ని చూడవలసి వస్తుందని కోటి అనుకోలేదు. సంవత్సరం నుంచి ఏడుస్తూనే ఉన్నాడు. సత్యం భోజనం చేయకుండా వెళ్ళిపోయిన రోజే గుండెలో కలుక్కుమని గుచ్చుకొంటూ ఉంది.

తులసమ్మ కలిపి ఇచ్చిన పాలగుజ్జు చిటికెడు చిటికెడు సత్యం గొంతులో వేస్తున్నాడు కోటి.

గొంతు తడిసి, కదిలి, తిరిగి, మింగుడుపడి, గుజ్జు వెన్నపూసలా జారి లోపలకు పోతూ ఉంది.

గ్లాసులోని గుజ్జంతా అయిపోగా, సత్యం గొంతులోంచి దగ్గులాగా శబ్దం వచ్చింది. ఏదో అనబోతున్నట్లుగా అన్నట్లుగా వినిపించింది.

సత్యం అన్నమాట 'సారీ' అని కోటికి తెలుసు.